సాక్షి ప్రకాశం

గురువారం | 21 | సెప్టెంబర్ | 2023



తీరంలో మరింత అప్రమత్తం

వినాయక నిమజ్జనాలు సజావుగా సాగేలా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.

- IIలో..



జాతీయ రహదారిపై ప్రమాదం

జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని ఒకరు మృతిచెందగా, 16 మందికి గాయాలయ్యాయి.

- IIలో..

గరిష్టం/కనిష్టం
37/29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

వందేహం..గణనాయకం



ఒంగోలు గద్దలగుంటలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మరమరాలతో తయారు చేసిన గణపతి

వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో గజాననుని భిన్న రూపాల్లో అలంకరించి పూజిస్తున్నారు.

- చిత్రమాలిక 10లో..

సాగు..బాగు

జిల్లాలో ఖరీఫ్ సాగు ఇప్పుడే ఊపందుకుంటోంది. 15 రోజులుగా కురుస్తున్న వానలతో నాట్లు వేస్తున్నారు. ఈ వర్షాలు పంటలకు జీవం పోశాయి. రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. అన్నదాతలు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. జిల్లాలో ఈ సీజన్ లక్ష్యం 5,36,442 ఎకరాలు కాగా ఇప్పటి వరకు సాగైంది 1,36,600 ఎకరాలు. అధిక విస్తీర్ణంలో పత్తి, మిరప, పొగాకు సాగుచేస్తున్నారు.

- 15 రోజులుగా కురుస్తున్న వానలతో ఖరీఫ్‌కు ఊపిరి
- జిల్లాలో ఖరీఫ్ లక్ష్యం 5,36,442 ఎకరాలు
- ఇప్పటి వరకు సాగైంది 1,36,600 ఎకరాలు
- సాగు కానున్న మిర్చి, వరి, పత్తి, కంది పంటలు
- పలు ప్రాంతాల్లో ఊపందుకున్న పంటల సాగు



వేములకోటలో సాగులో ఉన్న పత్తి పంట

మార్కాపురం: జూన్, జూలై, ఆగస్టు మధ్య వరకూ వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్ ఆలస్యంగా ప్రారంభమైంది. గత వారం నుంచి జిల్లాలో వర్షాలు కురవటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో కురిసిన వర్షాలు పత్తి, కంది రైతులకు ఉపయోగపడ్డాయి. దీంతో పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ పంటలన్నీ ఆశాజనకంగా ఉండగా, ఈ నెలాఖరు వరకు పశ్చిమ ప్రాంతంతో పాటు జిల్లాలోని టంగుటూరు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, ఒంగోలు, ముండ్లమూరు, కొత్తపట్నం, దర్శి, తాళ్లూరు, త్రిపురాంతకం, దొనకొండ, కురిచేడు తదితర ప్రాంతాల్లో వరినాట్లు వేయనున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వరినాట్లు వేశారు. ఈ వారంలో అధిక విస్తీర్ణంలో పత్తి, మిర్చి, పొగాకు పంటలు సాగు కానున్నాయి. జిల్లాలో మొత్తం 38 మండలాలు ఉండగా వ్యవసాయశాఖ పరంగా దర్శి, కనిగిరి, సింగరాయకొండ, ఒంగోలు, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ నెల 9 నాటికి మొత్తం ఒక లక్షా 36 వేల 600 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేశారు.

జిల్లాలో ఖరీఫ్ సాగు ఇలా...

జిల్లాలో ఖరీఫ్ లక్ష్యం 5,36,442 ఎకరాలకు గాను ఇప్పటి వరకు సాగైంది 1,36,600 ఎకరాలు. ఇందులో వరి 14,622 హెక్టార్లకు గానూ 2,733 హెక్టార్లు, జొన్న 233 హెక్టార్లకు గాను 30, సజ్జ 7,456 హెక్టార్లకు గాను 5,759, మొక్కజొన్న 1,834 గాను 2,035, కొర్ర 1,393 గాను 349, కంది 79,761 హెక్టార్లకు గాను 15,818, పెసర 1,276 గాను 74 హెక్టారుల్లో, మినుము 2,475 గాను 175 సాగయ్యాయి. వేరుశనగ 519 హెక్టర్లకు గాను 326 హెక్టార్లలో, నువ్వులు 2969 హెక్టార్లకు గానూ 826 హెక్టార్లలో, పొద్దుతిరుగుడు 161లకు గాను 11 హెక్టార్లలో, ఆముదం 1,886లకు గాను 1,047 హెక్టార్లలో సాగయ్యాయి. ఇంకా సోయాబీన్ తోపాటు పలురకాల నూనె జాతి పంటలు కూడా సాగు చేశారు.

ప్రధాన పంటల సాగు:

పత్తి 33,918 హెక్టార్లకు గాను 14,723, మిరప 20,722 గాను 7,691, పొగాకు 1,703 హెక్టార్లకు గాను 475 హెక్టార్లలో సాగు చేశారు. ఇంకా ఉల్లి, చెరకు, పొగాకు, పసుపు, టమోటా పంటలు కూడా సాగయ్యాయి. ఇవన్నీ ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రైతు భరోసా కింద 2,84,113 రైతు కుటుంబాలకు రూ. 213.08 కోట్లు అందజేసింది. అలాగే రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు, యంత్రాలు సైతం అందుబాటులో ఉంచింది.

మిర్చి, పత్తి సాగుచేశా



ఈ ఏడాది పత్తి, మిర్చి పది ఎకరాల్లో సాగు చేశాను. ఈ క్రాప్ కూడా నమోదు చేయించాను. వర్షాలు కురిస్తే మంచి దిగుబడులు వస్తాయని అనుకుంటున్నా. ఇటీవల కురిసిన వర్షాలు పంటలకు చాలా ఉపయోగం.

– జే.ఆవులయ్య, రైతు, వేములకోట

ఈనెలాఖరు వరకు పంటలు వేసుకోవచ్చు



జిల్లాలో ఈ నెలాఖరు వరకు పంటలు సాగుచేసుకోవచ్చు. సెప్టెంబర్ 15 వరకు జిల్లాలో 128.5 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 81.09 వర్షపాతం నమోదైంది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరుకు సంబంధించి మొత్తం 366.2 మి.మీ వర్షం నమోదు కావాల్సి ఉండగా, 239 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈనెలలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. వరి, పత్తి, మిర్చి పంటలు సాగుచేసుకోవచ్చు.

– శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు



త్రిపురాంతకం మండలంలో సాగవుతున్న వరి



మార్కాపురం మండలంలో సాగవుతున్న జొన్న

ఎంఎస్ఎంఈ రంగం ఎదుగుదల లక్ష్యంగా రుణాలు

- సిడ్బి డీజీఎం రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న డీజీఎం రాజేంద్రప్రసాద్

మద్దిపాడు: ఎంఎస్ఎంఈ రంగంలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి, విస్తరణకు అవసరమైన రుణ సౌకర్యాలను అందించేందుకు సిడ్బి (ఎస్ఐడీబీఐ-స్మాల్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో బ్యాంకు డీజీఎం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పారిశ్రామికంగా అన్ని వర్గాలకు రుణ సౌకర్యం కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల విస్తరణకు, కొత్త పరిశ్రమలు స్థాపించడానికి సిడ్బి దోహదపడుతుందని చెప్పారు. సిడ్బి కల్పిస్తున్న వివిధ రకాల రుణ పథకాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా ఎక్స్‌పోర్ట్స్ కోసం ఉభారే సితారే పథకం అందుబాటులో ఉందని, క్యాపిటల్ సహాయం, గ్రీన్‌ఫీల్డ్ వ్యాపారం కోసం స్థాపన పథకం అందుబాటులో ఉందని తెలిపారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని ఎస్ఈజెడ్ పరిధిలో ఉన్న పారిశ్రామికవేత్తలు ఈ పథకాల ద్వారా రుణం పొందవచ్చన్నారు. వడ్డీ 8 నుంచి 9.5 శాతంలోపు ఉంటుందని, రూ.50 కోట్ల వరకూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం ఇండస్ట్రీలపై అధిక కరెంటు బిల్లులు పడకుండా ఉండేందుకు నూరు శాతం సోలార్ ఎనర్జీ సేవింగ్ పథకం కేవలం 8 శాతం వడ్డీతో నూరు శాతం రుణ సౌకర్యం కల్పిస్తారని పారిశ్రామికవేత్తలకు తెలిపారు. ఈ అవకాశాలను గ్రోత్ సెంటర్‌లోని ఎక్స్‌పోర్ట్ యూనిట్లు, దాల్‌మిల్లులు, రైస్ మిల్లుల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట మేనేజర్ వేణుబాబు, ఐలా సభ్యులు లింగారామకృష్ణారెడ్డి చింతల వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, ఇండస్ట్రీయల్ కమిటీ మెంబర్ భక్త వత్సలం, డిక్కీ ప్రతినిధులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పోలినేని కోటేశ్వరరావు సస్పెన్షన్

ఒంగోలు: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలానికి చెందిన పోలినేని కోటేశ్వరరావును వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

'తానా' కవయిత్రుల సమ్మేళనానికి జ్యోతిర్మయికి ఆహ్వానం



సింహాద్రి జ్యోతిర్మయి

ఒంగోలు మెట్రో: ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక ఈనెల 24వ తేదీన, ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్య భేరీ అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనానికి జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయిని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ప్రతిష్టాత్మకమైన కార్యక్రమంలో కవిత్వం వినిపించేందుకు తనకు స్థానం కల్పించినందుకు తానా అధ్యక్షుడు నిరంజన్ శంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌కి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. 14 గంటల పాటు నిర్విరామంగా జరిగే ఈ సాహిత్య సమ్మేళనంలో భారత్‌తో పాటు విశ్వవ్యాప్తంగా సుమారు 15 దేశాలకు చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రులు, రచయిత్రులు, వీరితో పాటు ప్రముఖ మహిళలు పాల్గొంటారు. జ్యోతిర్మయికి ఈ అవకాశం రావడంపై నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, అధ్యక్షురాలు చిన్నలక్ష్మి కళావతి, ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్ బాబు హర్షం వ్యక్తం చేసి తమ అభినందనలు తెలిపారు.

9 మంది జూనియర్ అసిస్టెంట్‌లకు ఆర్ఐలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారితో కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న 9 మంది ఉద్యోగులకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లుగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ప్రకాశం భవనంలో పదోన్నతి పొందిన ఉద్యోగులకు నియామక పత్రాలు కలెక్టర్ అందజేశారు. ముండ్లమూరులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీ శ్రీధర్‌బాబును ఆర్ఐగా సీఎస్‌పురం తహశీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్‌లో టైపిస్ట్‌గా పనిచేస్తున్న బీ వరకుమార్‌ను కొత్తపట్నం, కలెక్టరేట్‌లో జూ.అసిస్టెంట్‌గా ఉన్న ఎస్‌వీ ప్రసాద్‌ను కొండపి, కలెక్టరేట్‌లో ఉన్న కే శ్రీకాంత్‌ను కొనకనమిట్ల, చీమకుర్తిలోని జీ విజయప్రసూనను టంగుటూరు, మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్‌వీ సుబ్బారావును మార్కాపురం తహశీల్దార్ కార్యాలయం, వీవీపాలెం తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీహెచ్ ప్రభావతిని నెల్లూరు కలెక్టరేట్, కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న పీవీ రామతేజను దొనకొండ తహశీల్దార్ కార్యాలయం, చీమకుర్తి తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న బీ రమేష్‌బాబును పొదిలి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అర్జీల పరిష్కారం అధికారుల బాధ్యత

- కలెక్టర్ దినేష్‌కుమార్
- జగనన్నకు చెబుదాంలో 154 అర్జీలు



అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ దినేష్ కుమార్

పొదిలి: అర్జీల పరిష్కారం బాధ్యత పూర్తిగా అధికారులదే అని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. దర్శి రోడ్డులోని ఫంక్షన్ హాలులో బుధవారం మండల స్థాయి స్పందన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్జీలు ఏవిధంగా డిస్పోజల్ చేయాలనే ఆలోచనకంటే, ఏవిధంగా పరిష్కారం చేయాలో ఆలోచించాలని సూచించారు. అర్జీ ఏదశలోనూ పరిష్కారానికి నోచుకోని పక్షంలో ఆ విషయం అర్జీదారునికి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం పెంచేందుకే మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమన్నారు. పిటీషన్లు రీ ఓపెన్ కాకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలన్నారు. మండల స్థాయి అధికారులు సమస్యలు పరిష్కరిస్తున్న తీరును నోడల్ అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో నియోజకవర్గ స్థాయిలో స్పందన నిర్వహించామని, స్థానికంగానే సమస్యలు పరిష్కారం చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మండల స్థాయిలో స్పందన జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా ప్రతి బుధ, శుక్రవారంలలో జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళుతున్నట్లు చెప్పారు. పిటిషన్ల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించాలి

పాత కోర్టుకు వెళ్లే రోడ్డు 40 అడుగులు ఉండాలని, ఇరువైపులా ఆక్రమణలతో కేవలం ఆరు అడుగులకే పరిమితమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ.రమణారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కళాశాలలు, ఆస్పత్రులు, ఇరిగేషన్ కార్యాలయంతో పాటు ప్రకాశ్‌నగర్‌కు రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే రోడ్డు ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్‌ఓ అజయ్‌కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ బి.ఉదయ్‌కుమార్, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీకృష్ణ, పలు శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అనధికార బ్యారన్ల నిర్మాణం చేపట్టవద్దు

- గత ఏడాది వచ్చిన పొగాకు ధరలు వచ్చే ఏడాది ఉంటాయనుకోవద్దు
- ఒక్కో బ్యారన్‌కు ఎస్ఎల్ఎస్ పరిధిలో 7.25 ఎకరాలు, ఎస్‌బీఎస్ పరిధిలో 4.75 ఎకరాలు సాగు లక్ష్యం
- రెండు నేలల్లో కలిపి 89.98 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి లక్ష్యం
- టుబాకో బోర్డు ఆర్ఎం ఎం.లక్ష్మణ రావు

ఒంగోలు సబర్బన్: పొగాకు రైతులు అనధికార బ్యారన్ల నిర్మాణం చేపట్టవద్దని టుబాకో బోర్డు ఆర్ఎం ఎం.లక్ష్మణరావు సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో గత సంవత్సరం పొగాకు మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని పొగాకు రైతులు అనధికారికంగా బ్యారన్లు నిర్మిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. గత సంవత్సరం పొగాకు ధరలు గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధికంగా వచ్చాయన్నారు. అయితే ఎప్పుడూ అదేవిధంగా ధరలు ఉంటాయనుకుంటే పొరపాటేనని సలహా ఇచ్చారు. పొగాకులో ధరలు శాశ్వతం కాదని, పొగాకు బోర్డు అనుమతించిన మేరకే సాగు చేపట్టాలని సూచించారు. ఈ సంవత్సరం బ్యారన్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 2023 సెప్టెంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. అపరాధ రుసుం లేకుండా 2023 అక్టోబర్ 26వ తేదీ వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా రూ.100 అపరాధ రుసుంతో నవంబర్ 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేస్తామని పేర్కొన్నారు. రూ.400 అపరాధ రుసుంతో నవంబర్ 10 నుంచి 20 వరకు బ్యారన్లు రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. దక్షిణ ప్రాంత తేలికపాటి నేలల్లో (ఎస్ఎల్ఎస్) బ్యారన్ ఒక్కింటికి 2.90 హెక్టార్లు (7.25 ఎకరాలు) 3,650 కేజీల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఇస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా దక్షిణ ప్రాంత నల్లరేగడి నేలల్లో (ఎస్‌బీఎస్) బ్యారన్ ఒక్కింటికి 1.90 హెక్టార్లలో (4.75 ఎకరాలు) 3,550 కేజీల పొగాకు ఉత్పత్తి లక్ష్యంగా అనుమతి ఇస్తారని వెల్లడించారు. మొత్తం మీద ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్‌లలో కలిపి వచ్చే సంవత్సరానికి గాను 89.98 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి లక్ష్యంగా సాగు చేసుకోవాలని పొగాకు బోర్డు నిర్ణయించి అనుమతించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రజల సమస్యలను పరిష్కరించమని అడిగాను



మాట్లాడుతున్న సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి

- దాడిచేశానని తహసీల్దార్ తప్పుడు ఆరోపణలు
- ఎస్ఎన్‌పాడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: ప్రజల సమస్యలను పరిష్కరించమని తహసీల్దార్ దృష్టికి తీసుకుపోతే దానిని వదిలేసి దాడిచేశాడని తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సంతనూతలపాడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం సంతనూతలపాడులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు, తనకు మధ్య జరిగిన వివాదాన్ని వివరించారు. విద్యార్థులకు సంబంధించించిన దాదాపు 600 సర్టిఫికెట్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని, దానితో పాటు ఆర్ఐ ప్రసాదరావుకు జీతాల బిల్లులు చేసి త్వరగా జీతాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను అడిగానని చెంచిరెడ్డి చెప్పారు. దానిపై తహసీల్దార్‌కు, తనకు మధ్య వాగ్వాదం జరిగిందని తెలిపారు. అంతే తప్ప భూములను ఆన్‌లైన్ చేయమని తహసీల్దార్‌ను అడిగింది లేదని, లేనిపోని ఆరోపణలు చేసి పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ తనపై ఫిర్యాదు చేస్తే దానిని ఎల్లో మీడియాలో అభూత కల్పనలతో తనకు సంబంధం లేని వార్తలను రాయడం పట్ల దుంపా చెంచిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఎల్లో మీడియాలో వచ్చిన వార్తలను నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానని సవాలు విసిరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ దుంపా యలమందారెడ్డి, టీ.శేషిరెడ్డి, ఎస్‌కే రహంతుల్లా, ఏటి మురళి, వల్లెపు శ్రీను, చిరంజీవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐ సస్పెన్షన్:

తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గొడవలలో ఆర్ఐ ప్రసాదరావు బాధ్యతా రాహిత్యమే కారణమని, ఆయన విధులను సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆర్ఐ ప్రసాదరావును సస్పెండ్ చేశారు. సస్పెండ్ ఉత్తర్వులను ఆర్ఐ, తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాలకు పంపించారు. తహసీల్దార్ కార్యాలయంలో తన విధులను ఆటంకపరిచి తనపై దాడిచేసినట్లు తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై ఎస్సై అంజనేయులు కేసు నమోదు చేశారు.

జిల్లా స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వెల్లడి

మార్కాపురం: మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 23వ తేదీన ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీలకు అన్నీ ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలకు కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సబ్ కలెక్టర్ సేథు మాధవన్‌తోపాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. జిల్లాలో ఉన్న వివిధ పాఠశాలల నుంచి 1000 మంది విద్యార్థినీ విద్యార్థులు రావచ్చని, ఇప్పటికే 800 మందికి పైగా తమ పేర్లు నమోదు చేసుకున్నారని ఎమ్మెల్యే చెప్పారు. 23వ తేదీ ఉదయం 8 గంటలకల్లా అందరూ పాఠశాలకు రావాలని, 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. క్విజ్, ఫోక్ డ్యాన్స్, వ్యాసరచన విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లోని సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన వసతితోపాటు బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సుమారు 100 మంది ఉపాధ్యాయులతో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే వెంట ఉపాధ్యాయులు మండ్లా రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, ఓవి వీరారెడ్డి, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వినాయక కలశం రూ.12 లక్షలు !

- వేలంలో దక్కించుకున్న వైఎస్సార్ సీపీ నేత రమణారెడ్డి
- రూ.6 లక్షలు పలికిన లడ్డు వేలం



రమణారెడ్డి దంపతులకు కలశం, మెమొంటో అందజేస్తున్న సర్పంచ్, వైస్ ఎంపీపీ దంపతులు

సీఎస్‌పురం (పామూరు): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సీఎస్‌పురం మండలం అయ్యలూరివారి పల్లెలో బుధవారం గణపతి మండపం వద్ద నిర్వహించిన వేలంలో కలశం అక్షరాలా రూ.12 లక్షలు పలికింది. అదేవిధంగా లడ్డు రూ.6 లక్షలు పలికింది. వేలంలో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముత్యాల రమణారెడ్డి (పోలిరెడ్డి), దంపతులు వేలంలో రూ.12 లక్షలు వెచ్చించి కలశం దక్కించుకున్నారు. లడ్డును గ్రామానికి చెందిన గానుగపెంట మోహన్‌రెడ్డి దంపతులు రూ.6 లక్షలు వెచ్చించి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డి, నాయకులు ముత్యాల నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, వెంకటరెడ్డిలు కలశం, లడ్డులను వేలం విజేతలకు అందజేసి ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

24న కందుకూరులో బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక ఈ నెల 24వ తేదీ 2 గంటలకు కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేష్, సెక్రటరీ టి.సుబ్బారావు తెలిపారు. ఈ ఎంపికలకు వయస్సుతో పరిమితి లేదు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు, క్రీడాకారిణులు పాల్గొనాలన్నారు. ఎంపికైన వారు బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. పోటీలు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో ఈ నెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలు తీసుకొని రావాలన్నారు. పూర్తి వివరాలకు 9866125955, 9849429859ను సంప్రదించాలని సూచించారు.

24న యోగ, ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 యోగా, ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 24న స్థానిక గద్దలగుంటలోని ఎస్‌పీకేఆర్ ఓరియంటల్ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ సుబ్బారావు, కె.వనజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. అండర్-17 విభాగంలో పాల్గొనే విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, ప్రిన్సిపాల్ నుంచి పొందిన ధ్రువీకరణతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9849429839ను సంప్రదించాలని సూచించారు.

తీరంలో మరింత అప్రమత్తం

- గణేశ్ నిమజ్జనాలు సజావుగా సాగాలి
- బీచ్‌లో సాయంత్రం 6 గంటల వరకే విగ్రహాలకు అనుమతి
- ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు
- కొత్తపట్నం బీచ్‌లో పర్యటించిన ఎస్పీ మలికాగర్గ్
- పోలీస్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం



కొత్తపట్నం తీరంలో మెరైన్, పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

కొత్తపట్నం: వినాయక నిమజ్జనాలు సజావుగా సాగేలా పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ మలికాగర్గ్ దిశానిర్దేశం చేశారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అపశ్రుతి, అవాంతరాలు లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ విగ్రహ నిమజ్జనాలు కొత్తపట్నం సముద్ర తీరంలో అత్యధికంగా చేయనున్న నేపథ్యంలో బుధవారం ఆమె తీరప్రాంతంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. తీర ప్రాంతంలో శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు పూర్తి చేసేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టామన్నారు. డీజే సౌండ్ వాహనాలను తీరం దగ్గరకు రానీయకుండా పార్కింగ్ చేయాలని ఆదేశించారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలువలు, చెరువుల వద్ద నిమజ్జనాల సమయంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. ప్రజలు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. వాహనాల దారి మళ్లింపు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, భక్తుల భద్రతా నియమావళిపై ఫ్లెక్సీలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీకి స్థానిక పోలీసులు వివరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్, ఎస్సై బి.సాంబశివరావు, మెరైన్ ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు

హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు సబర్బన్: హౌస్ వైరింగ్‌లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ పి.ప్రతాప్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 5వ తేదీ నుంచి 30 రోజులపాటు పురుషులకు హౌస్ వైరింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు శిక్షణకు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో రావాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సౌకర్యం ఉచితంగా కల్పిస్తామని వెల్లడించారు. వివరాలకు 94925 83484ను సంప్రదించాలని సూచించారు.

23 నుంచి కొండేపల్లిలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం కొండేపల్లి గ్రామంలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల 16 రోజుల పండుగ సందర్భంగా ఈ నెల 23న రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి లక్ష రూపాయలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, రెండో బహుమతి రూ.80 వేలను ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మూడో బహుమతి రూ.60 వేలను లక్ష్మీచెన్నకేశవ యూత్ అసోషియేషన్ కొండేపల్లి, నాలుగో బహుమతి రూ.40 వేలను మందటి ఆవులరెడ్డి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94408 37199, 81420 21443ను సంప్రదించాలని సూచించారు.

రైతులకు మెరుగైన సేవలు

- పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి

మార్కాపురం టౌన్: పీడీసీసీ బ్యాంకు ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మార్కాపురం, వైపాలెం, బేస్తవారిపేట, గిద్దలూరు, పొదిలి, కురిచేడు, దర్శి బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 29 బ్రాంచీల ద్వారా రూ.3,200 కోట్ల రుణాలిచ్చి 97 శాతం రికవరీలో ఉన్నామన్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం త్వరలో బ్యాంకులను డిజిటలైజేషన్ చేసి ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తామన్నారు. బ్యాంకు ద్వారా కారు, ఎడ్యుకేషన్, హౌసింగ్ తదితర రుణాలను ఖాతాదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.100 కోట్లు దాటిన బ్రాంచ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేస్తుందని, ఆ ప్రాంతంలో బ్యాంకు సొంత భవనాలను నిర్మిస్తామన్నారు. జిల్లాలో 26 మందికి అసిస్టెంటు మేనేజర్లుగా పదోన్నతులు కల్పించామని, కారుణ్య నియామకం కింద ముగ్గురికి ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, స్వయం సహాయక గ్రూపులకు బంగారు రుణాలు, జగనన్న తోడు, పీఎం సహాయ నిధి, స్వయం సహాయక సంఘాల్లో పని చేస్తున్న సిబ్బందికి పర్సనల్ లోన్లు అందిస్తామన్నారు. మొబైల్ ఏటీఎం ఏర్పాటుతో ప్రజలకు మరింత సేవలు అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకు అభివృద్ధి కోసం డిపాజిట్ల సేకరణ, రుణాల రికవరీపై సిబ్బంది దృష్టి పెట్టాలని తెలిపారు. సమావేశంలో పాలవర్గ సభ్యులు బాలగురవయ్య, జనరల్ మేనేజర్ కె.రాఘవయ్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

- ట్రావెల్స్ బస్సు-లారీ ఢీకొని ఒకరు మృతి
- మరో 16 మందికి గాయాలు



మృతురాలు మానస



త్రిపురాంతకం మండలం మేడపి వద్ద హైవేపై ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్



గాయపడిన వారిని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలింపు



పల్నాడు జిల్లా వినుకొండలో చికిత్స పొందుతున్న మహిళలు

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని ఒకరు మృతి చెందగా మరో 16 మంది గాయపడిన ఘటన బుధవారం ఉదయం త్రిపురాంతకం మండలంలో చోటుచేసుకుంది. కడప నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు త్రిపురాంతకం బైపాస్ ఫ్లైఓవర్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. దీంతో అందులో నుంచి మార్కాపురానికి చెందిన భీమిశెట్టి మానస, కడపకు చెందిన శివలక్ష్మి, మరో మహిళ అటుగా వస్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఎక్కారు. కర్నూలు నుంచి మెప్మా ట్రైనింగ్ కోసం 22 మంది ఆ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో విజయవాడకు వెళ్తున్నారు. ట్రావెల్స్ బస్సు త్రిపురాంతకం మండలం మేడపి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో భీమిశెట్టి మానస(22) అక్కడికక్కడే మృతిచెందగా, అదే ట్రావెల్స్ బస్సు రెండో డ్రైవర్ రాజేష్ రెండు కాళ్లు విరిగాయి. ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న కర్నూలుకు చెందిన బీ శానవ్, స్రవంతి, వెంకటేశ్వరమ్మ, హేమలతారెడ్డి, రామలక్ష్మి, షెఫీ ఉన్నీస, జ్యోతి, శివగంగ, మరో ఏడుగురు గాయపడ్డారు.

వెంటాడిన మృత్యువు

మృతురాలు మానస స్వగ్రామం మార్కాపురం కాగా ఆమె గుంటూరులో ఫిజియోథెరపీ మూడో సంవత్సరం చదువుతోంది. ఆర్టీసీ బస్సు ప్రమాదం నుంచి తప్పించుకున్నా.. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కి అది కూడా ప్రమాదానికి గురై మానస మృత్యువాత పడటంతో మృత్యువు వెంటాడిందని బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎస్‌ఐ సుమన్ తన సిబ్బందితో వెళ్లి క్షతగాత్రులను నాలుగు అంబులెన్స్‌ల్లో పల్నాడు జిల్లా వినుకొండ, గుంటూరుకు మెరుగైన వైద్య సేవల కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఆర్టీవో అమరనాథ్, ఎంవీఐ మాధవరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడు మృతి



సాయినితిన్‌రెడ్డి మృతదేహం



గాలి సాయినితిన్ రెడ్డి (ఫైల్)



మద్దలకట్టలో రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పెద్దారవీడు: రోడ్డు పక్కన ఉన్న బాలుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో మద్దలకట్ట గ్రామం బస్టాండ్ దగ్గర బుధవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామంలో వినాయక విగ్రహాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ట్రాక్టర్‌పై వినాయక విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. అనంతరం శ్రీశైలంలో నిమజ్జనానికి బయలుదేరేందుకు గుంటూరు – కర్నూల్ రహదారిపై వినాయక విగ్రహంతో వచ్చారు. అదే సమయంలో విజయవాడ డిపో ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి శ్రీశైలంకు వెళ్తుంది. ఊరేగింపులో పాల్గొన్న చిన్నారి గాలి సాయినితిన్‌రెడ్డి రోడ్డు పక్కన నిల్చొని ఉండగా వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు సాయినితిన్‌రెడ్డి(9)ని ఢీకొట్టి..కిందపడిన తర్వాత తలపై టైరు ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. బాలుడు 4వ తరగతి చదువుతున్నాడు. బాలుడి మృతితో బంధువు రోడ్డుపై రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు జోక్యం చేసుకొని ధర్నా విరమించారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యర్రగొండపాలెం ఎస్సై కోటయ్య, మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ నరసింహంలు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి శ్రీనివాసరెడ్డి, తల్లి కృష్ణవేణి, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎయిర్ స్ట్రిప్ పరిశీలన

- హైవే అధికారులకు ఎయిర్‌ఫోర్స్ బృందం సూచనలు



విమాన రన్‌వే ప్లాన్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ మండల పరిధిలో జాతీయ రహదారిపై సుమారు 6.4 కిలోమీటర్ల మేర కేంద్ర ప్రభుత్వం నిర్మించిన అత్యవసర విమాన రన్‌వే(ఎయిర్ స్ట్రిప్)ను బుధవారం ఎయిర్‌ఫోర్స్ కమాండర్ సి.ప్రదీప్ పిళ్లైతో కూడిన ప్రత్యేక బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు నేషనల్ హైవే అథారిటీ అధికారులకు తగిన సూచనలు చేశారు. రన్‌వేకు ఇరువైపులా ఉన్న 132 కేవీ విద్యుత్ స్తంభాలను తొలగించి అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ పనులను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. రన్‌వేకు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రన్‌వే అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని వేగంగా సేకరించాలని, త్వరితగతిన నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ దేవేష్ గోయల్, సైట్ ఇంజినీర్ ఆదిత్య, రెసిడెంట్ ఇంజినీర్ ఆర్.సతీష్, హైవే ఇంజినీర్ పి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

50 మంది ఎస్సీలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు



పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దాత నాగార్జున్‌రెడ్డి, ఎంపీపీ సావిత్రి

- నల్లగండ్ల సర్పంచ్ కుమారుడి ఔదార్యం
- రూ.6 లక్షలు వెచ్చించి 1.10 ఎకరాలు కొనుగోలు

హనుమంతునిపాడు: నిరుపేద ఎస్సీ కుటుంబాలకు ఓ సర్పంచ్ కుమారుడు ఉచితంగా ఇంటి స్థలం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నల్లగండ్ల సర్పంచ్ బత్తుల నారాయణమ్మ కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తుల నాగార్జున్‌రెడ్డి తమ గ్రామంలో ఇంటి స్థలం లేక ఇబ్బంది పడుతున్న 50 ఎస్సీ కుటుంబాలను గుర్తించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న 1.10 ఎకరాల భూమిని రూ.6 లక్షలకు కొనుగోలు చేశారు. ఒక్కొక్కరికి 2 సెంట్ల చొప్పున కేటాయించారు. బుధవారం గ్రామంలో ఎంపీపీ గాయం సావిత్రి చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేశారు. సర్పంచ్ నారాయణమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా స్థలాలివ్వడంతోపాటు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ కూడా చేయడం అభినందనీయమన్నారు. స్థలదాత నాగార్జునరెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు భవనం కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీ గాయం వినయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు జి.ఆదినారాయణరెడ్డి, బత్తుల శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ టి.తిరుపతరెడ్డి, ఏరువ వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రాణం పోతున్నా.. పిల్లల రక్షణ!

- స్కూల్ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు
- డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన పెనుముప్పు



సీటులో ప్రాణాలు విడిచిన డ్రైవర్ ఏడుకొండలు

అద్దంకి: గుండె నొప్పితో తాను చనిపోతానని తెలుసుకున్న డ్రైవర్.. నడుపుతున్న బస్సును రోడ్డు పక్కన ఆపి ప్రాణాలు విడిచిన సంఘటన బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని మైలవరం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. అద్దంకి మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన గుర్రాల ఏడుకొండలు(55) 13 ఏళ్ల నుంచి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉప్పలపాడు-మైలవరం రూట్‌లో పిల్లలను తీసుకుని స్కూల్‌కు వస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో.. బస్సును పక్కన ఆపి ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఊపిరి ఆగుతున్నా.. పిల్లల క్షేమం గురించి ఆలోచించిన డ్రైవర్ ఏడుకొండలు సమయస్ఫూర్తిని అందరూ ప్రశంసించారు.

ఉపాధ్యాయుడిపై ఎంఈఓ దాడి

- వైఎస్సార్ టీఎఫ్ నేతల పరామర్శ




సుధాకర్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

మార్కాపురం: ఉపాధ్యాయుడిపై ఎంఈఓ దాడి చేసిన సంఘటన బుధవారం పెద్దదోర్నాలలో చోటుచేసుకుంది. వివరాలు.. చిన్నదోర్నాల ఎంపీపీ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కె.సుధాకర్ ఆగస్టు నెల జీతం గురించి అడిగేందుకు ఎంఈఓ మస్తాన్ నాయక్ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన ఎంఈఓ దుర్భాషలాడుతూ గొంతు పట్టుకుని దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను బంధువులు బుధవారం మధ్యాహ్నం మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతున్న సుధాకర్‌ను వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, పలువురు నాయకులు పరామర్శించి దాడిని తీవ్రంగా ఖండించారు. దోర్నాల మండలంలో ఎవరైనా ఉపాధ్యాయులు మెడికల్, స్టడీ లీవ్ అడిగితే ఇవ్వకుండా ఎంఈఓ ఇబ్బంది పెడుతున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ౹

ఈవ్‌టీజింగ్, దాడి కేసులో నిందితుడు అరెస్టు

సింగరాయకొండ(టంగుటూరు): తన కుమార్తె వెంట పడి రోజూ వేధిస్తున్న యువకులను పద్ధతి మార్చుకోవాలని సూచించిన వ్యక్తిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ.. దాడి కేసులో ప్రధాన నిందితుడు బొజ్జా మహేష్ పరారీలో ఉన్నాడని, అతని స్నేహితుడు ఆటో డ్రైవర్ సదానందంను బైరాగి మాన్యంలో బుధవారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మహేష్‌ను త్వరలో పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్సై టి.శ్రీరామ్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో వీఆర్వో మృతి



సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ-2 వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న కళ్యాణి బుధవారం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఈమె బింగినపల్లి వీఆర్వోగా కూడా పని చేశారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆమెకు తన తల్లి కిడ్నీ దానం చేయడంతో కొంత కాలం బాగానే ఉన్నారు. ఆరోగ్యం కుదుటపడుతోందని అనుకుంటున్న తరుణంలో కిడ్నీ సమస్య పునరావృతమైంది. కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం మృతి చెందారు. గ్రామ సచివాలయ ఉద్యోగిగా ఎంపికైన కళ్యాణికి ఇంకా వివాహం కాలేదు. ఆమె మరణ వార్త తెలిసి మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఆమె భౌతిక కాయాన్ని తహసీల్దార్ సీహెచ్ ఉష, రెవెన్యూ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

స్టాఫ్ నర్సుల భర్తీకి నోటిఫికేషన్

ఒంగోలు అర్బన్: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉత్తర్వుల మేరకు గుంటూరు జోన్‌పరిధిలో ఖాళీగా ఉన్న 34 స్టాఫ్ నర్సుల పోస్టులు ఒప్పంద విధానంలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు గుంటూరు జోన్-3 కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు https://cfw.ap.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని గుంటూరు జోన్-3 ప్రాంతీయ ఆరోగ్య సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఒంగోలు అర్బన్: స్థానిక సెయింట్ థెరిస్సా హైస్కూల్లో విద్యార్థులకు శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో హాస్పిటల్ ఎండీ, ప్రముఖ మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్కూలు ప్రధానోపాధ్యాయుడు బొంతు ఆనందరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ మాట్లాడుతూ కొత్తపట్నం, పల్లెపాలెం తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కొన్నేళ్లుగా ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ ఏడాది సెయింట్ థెరిస్సా స్కూల్ విద్యార్థులకు అందజేశామన్నారు. ఉపాధ్యాయులు బాలశౌరి, కె.మధు, మార్నెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు చీమకుర్తి క్రీడాకారిణులు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన చీమకుర్తి జెడ్పీ గరల్స్ హైస్కూల్ విద్యార్థినులతో పీడీ

చీమకుర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీలకు చీమకుర్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు క్రీడాకారిణులు ఎంపికై నట్లు పీడీ డి.స్వరూపావాణి తెలిపారు. బుధవారం నియోజకవర్గ స్థాయిలో సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూల్లో నిర్వహించిన త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో వారు ఎంపికై నట్లు చెప్పారు. స్నేహ, చాందిని, ప్రియాంక, పవిత్ర, శృతి, భార్గవి త్రోబాల్, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికై న క్రీడాకారిణులతో పాటు పీడీ స్వరూపావాణిని స్థానిక గరల్స్ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం, టీచర్లు అభినందించారు.

జీపీఎస్ ఆమోదంపై పునరాలోచించాలి

ఒంగోలు సెంట్రల్: జీపీఎస్ పెన్షన్ స్కీమును క్యాబినెట్ ఆమోదించడంపై పునరాలోచించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీజీ కీర్తి, అశోక్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు అమ్మయ్య, ఐఫియా కౌన్సిల్ మెంబర్ పీవీ సుబ్బారావు కోరారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన

కంభం: మండలంలోని చిన్న కంభం సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం ఎంపీడీఓ ఎస్.ప్రసాద్‌బాబు పరిశీలించారు. అక్టోబర్ 3వ తేదీన సచివాలయంలో జరిగే మెడికల్ క్యాంపులో సర్వే ఆధారంగా స్పెషలిస్టు వైద్యులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి చుంచు సుధాకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





యు.శ్రీనివాసరెడ్డి సీహెచ్ శ్రీనివాసరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పిటికాయగుళ్ల నుంచి మోటార్ సైకిల్‌పై ఉప్పలపాటి శ్రీనివాసరెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డిలు చెరువు వద్దకు వెళ్తున్నారు. బస్‌ను ఓవర్ టేక్ చేసే సమయంలో అక్కపల్లె నుంచి పిటికాయగుళ్ల వైపునకు వెళ్తున్న స్కూల్ వ్యాన్‌ను మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఉప్పలపాటి శ్రీనివాసరెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్కూల్ వ్యాన్‌లో కంభంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు వైఏ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్ రమణమ్మ తెలిపారు. అమెజాన్ కంపెనీలో ప్రొడక్షన్ ఆపరేటర్స్, స్మార్ట్ మొబైల్ కంపెనీలో అసెంబ్లర్లుగా పనిచేయడానికి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18-35 సంవత్సరాల వయస్సు లోపు మహిళల్లో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 10 గంటలకు జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన అవసరం



నిమ్మపంటల సాగులో మెళకువలను తెలియజేస్తున్న హార్టీకల్చర్ జిల్లా అధికారి గోపీచంద్, సంధ్య

చీమకుర్తి: రైతులు సాగుచేస్తున్న ఉద్యానవన పంటలపై జిల్లా అధికారి వై.గోపీచంద్, మండల అధికారిణి సంధ్య బుధవారం అవగాహన కల్పించారు. చీమకుర్తి మండలంలోని మంచికలపాడు, పల్లామల్లి, చంద్రపాడు గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న ఉద్యానవన పంటలను పరిశీలించారు. నిమ్మ, నిమ్మ గడ్డి, పామా రోజా సాగులో మెళకువలు తెలియజేశారు. వాటికి పట్టే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మంచికలపాడులోని కోల్డ్‌స్టోరేజీలో పండ్లను మాగపెట్టే విధానాన్ని వివరించారు.

రిఫైనింగ్ చాంబర్, కోల్డ్ భూములకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులు ప్రతిఒక్కరూ వారుచేసే పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మోటుమాల కేజీబీవీ తనిఖీ

మోటుమాల (కొత్తపట్నం): మండలంలోని మోటుమాల గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని బుధవారం జీసీడీవో ప్రమోద ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, పాఠశాల పరిసరాలు, విద్యార్థుల మెను పరిశీలించారు. వసతుల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఫ్-1లో విద్యార్థినులకు వచ్చిన మార్కులను బట్టి విద్యార్థినులను గ్రూపులుగా విభజించి వెనుకబడిన వారికి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని కోరారు. విద్యార్థినులను గ్రూపులుగా విభజించిన తర్వాత వారిని పరీక్షలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ప్రస్తుతం జరుగుతున్న యూనిట్-3 పరీక్షలను తనిఖీ చేశారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యపై ఎంతో మక్కువతో రకరకాల కార్యక్రమాలను



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ప్రమోద

ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, వసతి దీవెన, విదేశ విద్యాదీవెన, ఇలా ఎన్నో కార్యక్రమాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. పాఠశాల కార్యక్రమాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌వో వి.అరుణ కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోండి

చీమకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సమయంలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండేందుకు అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ-1, 2 వెంకటేశ్వర్లు, శివాజి తెలిపారు. వారితో పాటు బైజూస్, ఐఎఫ్‌పీ ప్యానల్స్ రిసోర్స్‌పర్సన్లు బుధవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. డిజిటల్ బోర్డులు, బైజూస్ ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధనలో కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం,



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ, రిసోర్స్‌పర్సన్లు

రిసోర్స్‌పర్సన్‌లు శ్రీధర్, రాజేష్, అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైన కొమరోలు విద్యార్థులు

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, సర్వైట్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడంతో పలువురు అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షేక్ ఖాజారహంతుల్లా డిస్కస్ త్రో, షాట్‌పుట్ త్రోలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అండర్-18 విభాగంలో పోటీలు నిర్వహించారు. కిశోర్ 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా సర్వైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఎంవీ అనుప్రియ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీకాంత్ 2 వేల మీటర్ల పరుగు పందెం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్తేర్ మేరీ, పీఈటీ సతీష్

లో ప్రథమ స్థానంలో నిలిచాడు. భరత్ 100 మీటర్ల పరుగు పందెంలో లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలువగా ఎం.శ్రీచరణ్ హైజంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్తేర్ మేరి తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

పెద్దారవీడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి వి.వెంకటేశ్వర్లు రాష్ట్రస్థాయిలో బాల్‌బ్యాడ్మింటన్ ఆడేందుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కనకదుర్గ బుధవారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో ఆడేందుకు బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరచారని, చిత్తూరు జిల్లాలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని పీడీ పి. దామోదరరెడ్డి పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థి వెంకటేశ్వర్లును ఎస్‌ఎంసీ చైర్మన్ అల్లు లక్ష్మీగోవిందరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



విద్యార్థి వెంకటేశ్వర్లుతో ఉపాధ్యాయులు

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి



ఈ-క్రాప్ వివరాలు పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు



గోరుగుంతలపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

తర్లుపాడు: ఈనెల 30వ తేదీతో ఖరీఫ్ సీజన్ ఈ క్రాప్ నమోదు ముగుస్తుందని రైతులు తమ పంటల వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 3,808 ఎకరాలు మాత్రమే ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు. బుధవారం మండలంలోని గోరుగుంతలపాడులో పత్తి, కంది పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. పత్తిలో పచ్చదోమ నివారణకు థయోమిథాక్సమ్ 25 డబ్ల్యుజీ 0.2 గ్రాములు, ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్‌ఎల్ 0.4 మి.లీ మందును పిచికారీ చేయాలన్నారు. కందిలో మిడత మొక్కల కత్తిరింపు నివారణకు క్లోరోపైరిఫాస్ 20ఈసీ అర లీటరు లేదా 50 ఈసీ 300 మి.లీ మందును ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.

పంటల నమోదు తనిఖీ

పొదిలి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు ప్రక్రియను జిల్లా అధికారులు బుధవారం తనిఖీ చేశారు. పొదిలి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 107-1లో పోతురాజు వెంకటేశ్వర్లు అనే రైతు సజ్జ, కంది అంతర పంటగా సాగు చేశారు. ఆ పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జేడీఏ మాట్లాడుతూ.. పంటల నమోదు పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. కంకి దశలో ఉన్న సజ్జ పైరుకు శనగపచ్చ పురుగు ఆశించిందని, నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జైనులాబ్దిన్ సూచించారు.

బీజేపీ ప్రభుత్వంలోనే మహిళా సాధికారత

ఒంగోలు సెంట్రల్: మహిళా సాధికారత బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, మహిళా మోర్చా ఇన్‌చార్జి తీగల సత్యవతి అన్నారు. మహిళా బిల్లుకు ఆమోదం తెలిపిన సందర్భంగా బుధవారం ఒక ప్రకటనలో ఆమె హర్షం వ్యక్తం చేశారు. నూతన పార్లమెంటు భవనంలో ఆమోదించిన మొదటి బిల్లు మహిళా బిల్లు కావడం ఎంతో శుభపరిణామమని అన్నారు.

మాట నిలబెట్టుకోకపోతే బీజేపీకి గుణపాఠం తప్పదు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఒంగోలు టౌన్: మాదిగ, మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని దళిత నాయకుడు అంగలకుర్తి ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మహజన్ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ ప్రసంగిస్తూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద్, ఆదిమూలపు ప్రకాష్, తిరువీధిబాబు, పందింటి కాశి, కాంతారావు, జయకుమార్, బూదాల సురేష్, నరేష్, యోహాన్, సుదీర్, కోటయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రజల నుంచి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీఓ హనుమంతరావు సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పందన ద్వారా వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటి సర్వే చేస్తున్నందున ఆరోగ్య సిబ్బందికి అన్ని విధాలా సహకరించాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

ఈ-పంట నమోదు

జె. పంగులూరు: మండల పరిధిలోని బూదవాడలో బుధవారం ఈ- పంట నమోదు కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ- పంట నమోదు చేసుకోవటం వలన ఉచిత పంటల బీమా పథకం, పంటకొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనుటకు, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగినప్పుడు సున్నావడ్డీ పథకానికిప్రామాణికంగా తీసుకోవచ్చన్నారు.

పందుల బెడద నుంచి మొక్కజొన్నను కాపాడుకోవాలి

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు సాగుచేసిన మొక్కజొన్న పైరు ప్రస్తుతం పాలుపోసుకునే దశలో ఉన్నందున పందుల బెడద నుంచి కాపాడుకోవాలని ఏఓ ప్రసాదరావు సూచించారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మొక్కజొన్న పైరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారన్నారు. పైరు కండె పాలుపోసుకునే సమయంలో పందుల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. వాటి నుంచి పంటను కాపాడుకునేందుకు వైరుతో అల్లిన వలలను చేను చుట్టూ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాత చీరలను కర్రలకు గట్టిగా కట్టి చేను చుట్టూ ఏర్పాటు చేయాలన్నారు. కత్తెర షాపులోని వెంట్రుకలను పైరుకు దగ్గరగా అక్కడక్కడా వేస్తే.. ఆ వాసనకు పందులు దరిచేరవన్నారు. ఆయన వెంట వీఏఏ నాగరాజునాయక్, ఏఈఓ నాగరాజు, రైతులు ఉన్నారు.

జేఏఎస్ సర్వే విజయవంతం

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ తెలిపారు. బుధవారం ఉప్పుమాగులూరు సచివాలయంలో సర్వేను పరిశీలించారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వ పథకాలు

చీరాల టౌన్: అన్నదాతలకు అండగా నిలవడంతో పాటుగా ఆపన్న హస్తం అందిస్తున్నదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలను ఆదుకుంటున్నారని వ్యవసాయ సలహామండలి చైర్మన్ కె.రమణారెడ్డి అన్నారు. బుధవారం కావూరివారిపాలెంలోని నక్కలవారిపాలెంలో స్ప్రింకర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులపంట భూములను ఆర్‌బీకే, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. సలహామండలి చైర్మన్ మాట్లాడారు. డ్రిప్ ఇరిగేషన్ రాయితీ పరికరాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాస్‌పుస్తకం, 1బి, తదితర దరఖాస్తులు అందించాలన్నారు. ఆర్‌బీకే అధికారి హిమేలియా, రైతులున్నారు.

25 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు



సమావేశానికి హాజరైన పీఈటీలు

మార్కాపురం టౌన్: ఈ నెల 25, 26, 27వ తేదీల్లో మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్, పాఠశాల పీడీ ఎం.జాహ్నవి ప్రియ తెలిపారు. బుధవారం పాఠశాలలో సమీక్ష సమావేశం అనంతరం పోటీల వివరాలు వెల్లడించారు. మండల స్థాయిలో అండర్-14- అండర్-17 విభాగాల్లో ఎంపిక చేసిన జట్లను పోటీల్లో పాల్గొనేలా చూడాలని పీఈటీలు, పీడీలను కోరారు. సమావేశంలో పీఈటీలు మంత్రునాయక్, రమణయ్య, లక్ష్మీనారాయణ, రమేష్, శ్రీనివాసులు, బాబూరావు, శ్యామల, ఉమాకృష్ణ పాల్గొన్నారు.



కొత్తపట్నం తీరంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

94 వినాయక విగ్రహాలు నిమజ్జనం

కొత్తపట్నం: వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలలో మూడో రోజైన బుధవారం కొత్తపట్నం మండలంలోని సముద్రతీరంలో 94 విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొత్తపట్నం తీరంలో 56, ఈతముక్కల తీరంలో 22, మడనూరు తీరంలో 16 విగ్రహాలను నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు సముద్రస్నానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సముద్రంలో లోతుకు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానంతో సమస్యల పరిష్కారం

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానం సమస్యలన్నింటికి పరిష్కారమార్గాన్ని సూచిస్తుందని మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య పేర్కొన్నారు. బుధవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా కల్పించిన ఉమ్మడి రిజర్వేషన్లను కులాల జనాభా దామాషా ప్రకారం విభజించడం సరికాదన్నారు. ఇది మాదిగల ప్రయోజనాలకు ఏమాత్రం వ్యతిరేకం కాదన్నారు. మన రాష్ట్రంలో మాలల జనాభా 65 శాతం, మాదిగల జనాభా 35 శాతం ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దళితులను విభజించి పాలించే రీతిలో ఐక్యతను చీల్చి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఈ కుట్రలో నష్టపోయేది మాలమాదిగలు తప్ప అగ్రకులాలు కాదని, లోతుగా అర్థం చేసుకుని కేవలం ఎంఆర్‌పీఎస్ వాదననే వ్యతిరేకించకుండా మన భవిష్యత్తు తరాల వారిని కూడా దృష్టిలో ఉంచుకుని ఐక్యతతో సంఘీభావంత దళితులు అప్రమత్తమవ్వాలని కోరారు.

ముగిసిన జేసీస్ 48వ చార్టర్ నైట్ సంబరాలు



పూర్వ అధ్యక్షులను సన్మానిస్తున్న ప్రస్తుత పాలకవర్గం

ఒంగోలు: ఒంగోలు జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ 48వ చార్టర్ నైట్ సంబరాలు ఘనంగా ముగిశాయి. స్థానిక ఒంగోలు మౌర్యా ఇన్‌లో బుధవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నామినేని మోహన్‌రావు మాట్లాడుతూ జేసీస్ ఒక వ్యక్తిత్వ వికాస సంస్థ అని, ఈ సంస్థను ఒంగోలులో స్థాపించి 48 సంవత్సరాలు పూర్తికావడం ఆనందంగా ఉందని అన్నారు. ఐపీపీ డాక్టర్ జి.రవికుమార్ జేసీస్ ప్రస్తుత అధ్యక్షుడు పులి రామాంజనేయులుతో పాటు 48 సంవత్సరాలుగా జేసీస్‌కు అధ్యక్షులుగా పనిచేసిన వారందరినీ జేసీ వీక్ చైర్మన్ జనార్దన్ సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



కృష్ణారెడ్డి సంతాప సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

- ఘన నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పొదిలి మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్, వెలిగండ్ల గ్రామ మాజీ సర్పంచ్ పాతకోట వెంకటకృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, మార్కాపురం, చీరాల ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెలిగండ్ల గ్రామంలో కృష్ణారెడ్డి దశదిశ కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో వారు పాల్గొన్నారు. కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 50 ఏళ్లుగా కృష్ణారెడ్డి కుటుంబం రాజకీయాల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానిగా ఉంటూ పార్టీకి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కృష్ణారెడ్డి కుమార్తె చీరాల ఆర్డీఓ సరోజిని, ఆయన వారసుడు, సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, అద్దంకి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, పీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా, మాజీ ఎమ్మెల్యేలు పాపారావు, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కృష్ణారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే ప్రారంభం

వెలిగండ్ల: వెలిగండ్ల మండల కేంద్రంలో బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీఆర్వో బెంజిమెన్ మాట్లాడుతూ డ్రోన్ సర్వే ద్వారా వెలిగండ్లలోలోని సర్వే నంబర్ల వారీగా వాటి విస్తీర్ణం నిర్ధారిస్తామన్నారు. భూములు సర్వే చేసే సమయంలో భూ యజమానులకు తెలియజేస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ శివ, రైతులు ఆదిరెడ్డి పాల్గొన్నారు.